క్లుప్తంగా

మహిళా పోలీస్ మాధురికి ప్రతిభ అవార్డు



జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చేతులమీదుగా ప్రతిభ అవార్డు అందుకుంటున్న మాధురి

గణపవరం : గణపవరం మండలం జల్లికాకినాడ గ్రామ సచివాలయ మహిళా పోలీస్ జీఎంఎస్‌కే మాధురి ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చేతులమీదుగా ఏలూరు ఎస్పీ కార్యాలయంలో గురువారం ప్రతిభ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభ చూపినందుకు మాధురికి ఈఅవార్డు అందచేశారు. ఈసందర్భంగా ఆమెను ఎస్పీ శర్మ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలన్నారు. మాధురిని గణపవరం సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వేముల వెంకటేశ్వరరావు అభినందించారు.

నేడు సోమవరప్పాడులో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు : సోమవరప్పాడు గ్రామంలోని ఆర్టీసీ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పథకాల అమలులో వెల్ఫేర్ అసిస్టెంట్ల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి

దెందులూరు : ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యల గుర్తింపులో వెల్ఫేర్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత కీలకమని ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో లక్ష్మి సమీక్షించారు. తొలుత గ్రామాల వారీగా పథకాల నమోదు, ఆన్‌లైన్, పెండింగ్, ఇతర సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలు గుర్తెరిగి పథకాల అమలుకు మంజూరు ప్రక్రియలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏఓ భీమరాజు, ఏబీపీఆర్ చౌదరి, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి చౌదరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. పోతునూరు గ్రామంలో పునర్నిర్మిస్తున్న శ్రీకోదండ రామాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందిస్తున్నామన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా బాలికలు, మహిళలకు కుట్టు శిక్షణ, యువతకు ఉపాధి రంగాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి తరం యువత సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుబ్బల సత్యనారాయణ, ఆడారి శివన్నారాయణ, కొల్లు శ్రీనివాస్, చేయబోయిన సాయి, ఏలూరు నాంచారి బాబు, బెజవాడ ప్రసాద్, బత్రాజు సత్యనారాయణ, యాతం హరిబాబు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభం

కామవరపుకోట : సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభమని సేంద్రియ వ్యవసాయ మండల కోఆర్డినేటర్ షేక్ హుస్సేన్ బి అన్నారు. గురువారం తడికలపూడి గ్రామంలో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు అగ్ని అస్త్రం సేంద్రియ ఎరువును తయారు చేశారు. ఈ సేంద్రియ ఎరువు తయారీకి వేపాకు, 30 లీటర్ల ఆవు మూత్రం, 15 కిలోల పొగాకు, 1 1/2 వెల్లుల్లి, 1 1/2 పచ్చిమిర్చితో తయారు చేయవచ్చునని, అరు లీటర్ల అగ్ని అస్త్రంతో 200 లీటర్ల నీటిని కలిపి పంటకు పిచికారి చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఈ.వల్లూరిప్రేమ్‌కుమార్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగనన్నకు ప్రజలు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఉంగుటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు (గణపవరం): స్వాతంత్ర్యానంతరం ప్రకటనలు, కాగితాలకే పరిమితమైన సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చేసి చూపిస్తున్నారని, మనమంతా ఆయనకు అండగా నిలవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఉంగుటూరులో 119వరోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలు వివరించారు. నవరత్నాల పథకాలద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. రాష్ట్రచరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలను ఏకకాలంలో అమలు చేసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే వారికి ఆయా పథకాలు మంజూరు చేయడం సీఎం వైఎస్ జగన్ పాలనలోనే సాధ్యమైందన్నారు. పచ్చమీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, వాస్తవమేమిటో గ్రహించి, జగనన్నకు అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి సమస్యలు తెలుసుకున్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇళ్లస్థలాలు ఇచ్చామని, అర్హులందరికి మళ్లీ రెండో విడత స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. కొందరు తమ పిల్లలకు సదరం సర్టిఫికెట్లు కావాలని కోరారు.రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ పి.బాలకృష్ణ, సందక రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి బాబ్జి, పార్టీ నాయకులు రంగు వెంకటేశ్వరరావు, దూసనపూడి లక్ష్మీనారాయణ, ఎస్ఎస్ బాజీ, భావన సూరిబాబు, మంద జయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో గడప గడపకు మన ప్రభుత్వం

గణపవరం : ఉంగుటూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పేదలకు అందిన పథకాలు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ఎస్ఏ-1 రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈవో రవీంద్ర భారతి

ఉంగుటూరు (నిడమర్రు): సంగ్రహణాత్మక మూల్యాంకనం-1లో మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులకు పాఠశాల అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తాడేపల్లిగుడెం డీవైఈవో ఎస్.రవీంద్ర భారతి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కైకరం జెడ్పీస్కూల్‌ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఎస్ఏ-1 పరీక్షల జవాబు పత్రాలను, సంబంధిత ఉపాధ్యాయుల వ్యక్తిగత రికార్డులు తనిఖీ చేశారు. జవాబు పత్రాల్లోని తప్పులు సరిచేసి, ఆ తప్పులు విద్యార్థులు గుర్తించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. దుద్దిన జవాబు పత్రాలను విద్యార్థి ఇంటికి పంపించాలని, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ శ్రీనివాసకుమార్ తదితరులున్నారు

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పెదయాగనమిల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఏలూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. గురువారం ఏలూరు మండలం పెదయాగనమిల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి గ్రామ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనాయకులు ఇస్తున్న బూటకపు వాగ్దానాలు, మాయమాటలు విని మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి తిరిగి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా కొల్లేరు గ్రామాల్లో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. అర్హత కల్గిన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలే నాగసులోచన, సైదు విజయలక్ష్మీతో పాటు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీడీఓ బి ప్రణవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, పల్లెం ప్రసాద్, మండల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలపై అవగాహన



డ్రమ్ములో దోమల సంతతిని పరిశీలిస్తున్న మలేరియా అధికారి లక్ష్మణరావు, వైద్యసిబ్బంది

గణపవరం : అన్నిరకాల వ్యాధులకు మూలకారణం దోమలేనని, దోమల నిర్మూలనతో ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. గురువారం గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామంలో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమం, కీటక నియంత్రణ చర్యలు, పరిసరాల శుభ్రతపై అవగాహన, డ్రైడే నిర్వహణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి దోమల వ్యాప్తి, నివారణ, రక్షణ చర్యలపై వివరించారు. కలరా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులకు కారణం దోమలేనన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీటి కుంటలు లేకుండా చూసుకోవాలని, మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని, దోమలనుంచి రక్షణకు తెరలు, కాయిల్స్ వంటివి వాడాలని సూచించారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. వీధులలో పారిశుధ్య పనులు చేపట్టారు. బ్లీచింగ్ చల్లి మురుగు నీరు తొలగించారు. చెత్తా చెదారం తరలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి కనకలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు రామకృష్ణంరాజు, కాంతారావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

దెందులూరు : మండలంలోని మూడు గ్రామాల్లో స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం విచారణ నిర్వహించినట్లు దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దెందులూరు, సత్యనారాయణపురం, గోపన్నపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించామని, నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలి



భీమడోలు మండలంలో ఐరన్ మాత్రలను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మానస



కాశిపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్రీయ కౌమార స్వస్తా కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మానస అన్నారు. మండలంలోని గుండుగొలను నెం.1 పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, భోగాపురం, వడ్డిగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గుండుగొలను నెం.1 ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఐరన్ మాత్రలు ఏ రంగులో ఉన్నవీ వేస్తున్నారు, కోడిగ్రుడ్లపై వేసిన కలర్‌లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెనూ ప్రకారం వండిందీ లేనిదీ పరిశీలించి చిన్నారులను రుచి అడిగారు. మరుగుదొడ్లను పరిశీలించారు. హెచ్ఎం పాశం పాండురంగారావు పలు అంశాలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా అసంక్రమిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించినట్లయితే వాటి నివారణ సాధ్యమవుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు తెలియజేసి చైతన్యపర్చాలన్నారు. రక్త హీనత సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి వారం వారికి పరీక్షలు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

గణపవరం : విద్యార్థులలో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తి చదువులో వెనుకబడతారని అందువల్ల ప్రతి ఒక్కరూ రక్తహీనత సమస్య నుంచి బయటపడాలని హెచ్ఎం బి.కాంతిశ్రీ అన్నారు. గురువారం కాశిపాడు హైస్కూల్‌లో ప్రధానమంత్రి బాలస్వస్థ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేశారు. ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఐరన్ మాత్రలు వేశారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వాడటంతో పాటు ఆకు కూరలను ఎక్కువగా తీసుకొంటే రక్తహీనత సమస్య ఉండదన్నారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

దెందులూరు : అన్ని అవయవాల్లో కెల్లా కన్ను అతి ముఖ్యమైదని జోగన్నపాలెం కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జోగన్నపాలెం కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జోగన్నపాలెం, అప్పారావుపాలెం, విద్యానగర్, శ్రీరామవరం గ్రామాలకు చెందిన వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఆపరేషన్ ఎప్పుడు చేసేది త్వరలో తెలియచేస్తామని కంటి వైద్యులు చెప్పారు. ఈ శిబిరంలో సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంకుసిబ్బంది, కంటి వైద్య విభాగం సిబ్బంది ఉన్నారు.

అటవీ బంజరు భూములు పేదలకు పంచాలి

టి నరసాపురం : అటవీ బంజరు భూములను ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు డిమాండ్ చేశారు. స్థానిక గండిమెట్ట వద్ద సీపీఐ బందంచర్ల శాఖ సమావేశం వీరంకి వెంకట్రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిమెట్ట, బందంచర్ల గ్రామాల్లోని అటవీ బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసి భూమి లేని పేదలకు కుటుంబానికి హెక్టారు చొప్పున భూపంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, అడ్వకేట్ ఎం.రాజ్ కుమార్, తాణంకి కొండయ్య, శౌరి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి



పునుకొల్లులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాంబాబు

పెదపాడు : మండలంలోని పునుకొల్లు గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరుపై డ్వామా పీడీ రాంబాబు మండిపడ్డారు. గురువారం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పనులు జరుగుతున్న విధానాన్ని, మస్తర్లు పరిశీలించారు. పనులు గుర్తించి ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో లేనివారికి, పనులకు రాని వారికి ఉపాధి హామీ పనుల్లో మస్తర్లు వేయరాదన్నారు. అలా జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. టెక్నికల్ అసిస్టెంట్ల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి చర్యలు జరగడానికి అవకాశం ఉందన్నారు. పనులు జరిగేటప్పుడు మస్తర్లు తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో నిర్మలజ్యోతి

పెదపాడు : అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.నిర్మలజ్యోతి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీడీవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పీఎంజేఏవై పథకంలో సంబంధించి ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాధాన్యత భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దాసరి సుమలత, ఈఓఆర్డీ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలపై ఉచిత సహాయం

ఏలూరు (టూటౌన్): వినియోగదారులకు కలిగే సేవాలోపాలకు సంబంధించిన అంశాలపై ఉచిత సహాయం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరమ్ చైర్మన్ పెంజుర్తి రవికిరణ్ చెప్పారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఫోరం సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో ఏదో ఒక విషయంలో వస్తువుల నాణ్యతా లోపం, ఆహార పదార్థాల కలుషితం, సేవాలోపం వలన వివిధ రకాలుగా నష్టపోతున్న వినియోగదారునికి ఉచితంగా సమస్యను పరిష్కరించేందుకు తమ సంస్థ సభ్యులు పని చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పాలొన్న జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి పాతూరి రామరాజు మాట్లాడుతూ సమాజంలో కలుషిత ఆహారాన్ని నియంత్రించాలన్నారు. ఏలూరు జిల్లా ఇంఛార్జీ కోరాడ నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు దాసరి మోజేస్, కార్యదర్శి ధర్మవరనపు దుర్గారావు మాట్లాడారు.

ఘనంగా వేమన జయంతి



పిప్పరలో యోగివేమన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



బువ్వనపల్లిలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



భీమడోలులో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గణపవరం : పండిత, పామరులకు అర్థమయ్యేలా వేమన రచించిన వేమన శతకం జీవిత సత్యాలను వివరిస్తుందని పలువురు అన్నారు. వేమన జయంతి వేడుకలు పిప్పర శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన శతకంలోని పద్యాలను చదివి వినిపించారు. కే.శే. గుడ్లవీరన్న దంపతుల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సీతారామయ్య(యుఎస్ఏ) శాఖా గ్రంథాలయానికి శాశ్వత విరాళంగా రూ.10వేల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో ఐవీ నర్సింహరాజు, గుడ్ల వెంకటకృష్ణారావు, పమ్మి సత్యనారాయణమూర్తి, గ్రంథపాలకుడు పి.రంగారావు పాల్గొన్నారు

నిడమర్రులో..

నిడమర్రు : ప్రజాకవి యోగి వేమన జయంతి సందర్భంగా గురువారం బువ్వనపల్లి యూపీ స్కూల్లో విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్ పెద్దిరాజు మాట్లాడుతూ వేమన తన పద్యాలతో జీవిత సత్యాలు తెలిపిన తీరు అద్భుతమన్నారు. వేమన పద్యాలు దేశ విదేశీయులను సైతం ఆకర్షించాయన్నారు. ముందుగా యోగి వేమన చిత్ర పటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కైకరంలో

కై కరం జెడ్పీస్కూల్లో హెచ్ఎం చేబ్రోలు శ్రీనివాసరావు అధ్యక్షతన వేమన జయంతి నిర్వహించారు. విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. వేమన చిత్రపటానికి నివాళులర్పించారు.

వేమన పద్యాలు సమాజానికి దిశానిర్దేశం

భీమడోలు : ప్రజాకవి, సామాజిక విప్లవ యోధుడు యోగి వేమన పద్యాలు సమాజాన్ని నిర్దేశిస్తాయని, వాటిని నేర్చుకుని సన్మార్గంలో నడుచుకోవాలని భీమడోలు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువారం వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేమన జీవిత సత్యాలను పద్యాల్లో చెప్పిన తీరు అభినందనీయమన్నారు. ఈ పద్యాలు ప్రస్తుతం, భవిష్యత్తు తరాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత చిన్నారులు చందూకుమార్, హేమంత్ వేమన పద్యాలను వల్లించారు. విద్యార్థినీ అనూహ్య వేమన జీవిత చరిత్ర తదితర అంశాలపై ప్రసంగించింది. కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, సర్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.